

కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తాం 8లో..

సింగరేణి కార్మికులు మద్దతు ఇవ్వాలి 8లో..

నిష్పక్షపాతంగా ఎన్నికల విధుల నిర్వహణ

అదనపు బ్యాలెట్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

వంద శాతం ఓటర్ సమాచార స్లిప్పు పంపిణీ చేయాలి

పోలింగ్ సిబ్బందికి మౌలిక వసతులు కల్పించాలి

డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా నిఘా ఏర్పాటు

సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ అధికారులు

పెద్దపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల విధులను ప్రతి ఒక్కరు నిష్పక్షపాతంగా నిర్వహించాలని, పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థిని ఒకే తరహాలో చూడాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై నిర్వహించిన వీడియో సమావేశంలో హైదరాబాద్ నుంచి రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్,పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, పెద్దపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా, వ్యయ పరిశీలకులు సమీర్ నైరంతర్యాలతో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో పారదర్శకంగా విధులు నిర్వహించాలని, అందరినీ సమానంగా చూడాలని ఎవరిపై పక్షపాతంతో వ్యవహరించడం చేయవద్దని తెలిపారు.

భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పక్కాగా ఎన్నికల విధులు నిర్వహించాలని, ఎక్కడా ఏ చిన్నపొరపాటు రాకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోటీలో ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్న నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు చేరుకున్నాయని, ఈవీఎం బ్యాలెట్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరి కి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని, హోమ్ ఓటింగ్ ప్రక్రియను నిబంధనల ప్రకారం మే 8 నాటికి పూర్తిచేయాలన్నారు.

హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓట ర్ల వివరాలను పోటీలో ఉన్న అభ్యర్థులకు తెలియజేయా లని ఆయన సూచించారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కంటే ముందుగానే వంద శాతం ఓటర్ సమాచార స్లిప్పులు ప్రతిఒక్క ఓటర్‌కు అందేలా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రం లొకేషన్ ఓటర్లకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కేంద్రం వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఆహారం, ఇతర వసతులు కల్పించాలన్నారు. సకాలంలో పోలింగ్ ప్రారంభం కావాలని, పోలింగ్‌కంటే ముందు మాక్‌పోల్ నిర్వహించాలని, పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో అవసరమైన శిక్షణ అందించాలన్నారు. సెక్టార్ అధికారులు విజయవంతంగా పోలింగ్ నిర్వహించడంలో కీలక పాత్ర పోషించాలని, ఈవీఎం యంత్రాలు పనిచేయ ని పక్షంలో నూతన ఈవీఎం యంత్రం ఏర్పాటుచేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై సెక్టార్ అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ అందజేయాలని తెలిపారు. పోలింగ్ రోజున జిల్లా కేంద్రాల్లో నిపుణులైన అధికారులచే కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం సహాయకేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ తేది దగ్గరపడుతున్న సమయంలో డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటుచేయాలన్నారు.

సి విజిల్ యాప్ వినియోగంపై ప్రజలు విశిష్ట ప్రచారం కల్పించాలని, పోలింగ్ శాతం పెరిగే విధంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో ఎటు వంటి డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా చర్యలు తీసు కోవాలని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, అకౌంటింగ్ బృందాలు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ డబ్బు, మద్యం పంపిణీ కాకుండా చూడాలన్నారు. లోక్ సభ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, పోలింగ్ నిర్వ హణపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో వచ్చే చిన్నచిన్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు అధిగమిస్తూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహిం చాలని సూచించారు.

55 శాతం ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ

జిల్లాలో ఇప్పటివరకు 55 శాతం ఓటర్ సమాచార స్లిప్పు లు పంపిణీ చేశామని, మిగిలిన ఓటర్లకు సైతం పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని పెద్దపల్లి పార్లమెంటు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఎన్నికలలో డబ్బు, మద్యం ప్రభావం లేకుండా అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు చేపట్టామన్నారు. సి విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు.

పెద్దపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో దాదాపు 200 పైగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని, కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పన పూర్తయిందని, ప్రతి పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు రోడ్డు వ్యవస్థ బాగా ఉందన్నారు. ఓటర్ సమాచార స్లిప్పు పంపిణీ ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నామని, ప్రతి ఓటరుకు ఓటర్ సమాచార స్లిప్పులు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈవీఎం యంత్రాల రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ రెండు రోజులలో పూర్తిచేస్తామన్నారు. రామగుండం పోలీస్ కమిష నర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశామని, ఈవీఎం యంత్రాల తరలింపు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం ఉండకుండా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని, అక్రమ డబ్బు, మ ద్యం పంపిణీ కాకుండా గట్టి వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో డీసీపీ ఎం చేతన, డీటీ ప్రవీణ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

యంత్రాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి

- మంథని ఆర్డీవో హనుమానాయక్

రామగిరి, మే 2: యంత్రాల వినియోగంపై అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రక్రియలో భాగంగా జేఎన్టీయూ కళాశాలలో పీవో, ఏపీవో అధికారులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంథని అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన వీవీ ప్యాట్, బ్యాలట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మే 13న జరిగే పోలింగ్ విజయవంతం చేసేందుకు పోలింగ్ అధికారులు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. యంత్రాల్లో వచ్చే సాంకేతికంగా వచ్చే ఇబ్బందులను పరిష్కారించుకొనే విధంగా అవగాహన ఉండాల్సిందిగా తెలిపారు. నియెజకవర్గంలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎంపీ అభ్యర్థుల బరిలో 42 మంది ఉన్న నేపథ్యంలో 3 బ్యాలెట్ యూనియన్ ఏర్పాటు తర్ఫీదు పొందాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌లు ఆరిఫొద్దీన్, రాంచందర్‌రావు, డిటి కోటేశ్వర్‌రావు, మాస్టర్ ట్రైనర్స్ గోపు రవీందర్‌రెడ్డి, హరి ప్రసాద్, భరత్ రెడ్డి, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దాడులను సహించేది లేదు : కొప్పుల

రామగిరి, మే 2: బీఆర్ఎస్ నేతలపై దాడులకు పూనుకుంటే సహించేది లేదంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధు హెచ్చరించారు. గురువారం మండలంలోని బేగంపేట్‌కు చెందిన సర్పంచ్ భర్త బుర్రశంకర్‌ను ఆయన నివాసంలో పరామర్శించారు. దాడి వివరాలతో పాటు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంథనిలో మళ్లీ అరాచకాలు మొదలయ్యాయని, ఇక్కడ మంత్రి శ్రీధర్‌బాబు 75 ఎంఎం సినిమా చూపిస్తానని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుండడం మూలంగానే తమ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడి నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టింపు కరువయ్యిందన్నారు. మంత్రి ఆదేశాల మేరకే పోలీసులు పని చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. పోలీసులు పారదర్శకంగా వ్యవహరించి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకేషి రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, నాయకులు కుమార్, భాస్కర్, తిరుపతి, శ్రీనివాస్, లక్ష్మణ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



చౌరస్తాలో పరిశీలిస్తున్న కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్

నేడు గోదావరిఖనికి కేసీఆర్

- చౌరస్తాలో రోడ్‌షో

- పరిశీలించిన అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మే 2: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుక్రవారం సాయంత్రం గోదావరిఖనికి రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం గోదావరిఖని చౌరస్తా నుంచి కేసీఆర్ రోడ్‌షో నిర్వహిస్తున్నారు. రోడ్‌షోకు సంబంధించిన ఏర్పాట్లు, జన సమీకరణకు సంబంధించి గురువారం చౌరస్తా ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

- వంశీని ఎంపీగా గెలిపించాలి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్, మే 2: రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు కోరారు. గురువారం మండలంలో ఎన్నికల ప్రచారం చేశారు. ముందుగా కమాన్‌పూర్ క్రాస్‌రోడ్డు నుంచి జూలపల్లి వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశం పాల్గొని మాట్లాడారు. పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గానీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతితో, అధిక ధరలతో, నిరుద్యోగంతో ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధిహామీ పనిదినాల పెంపుతో పాటు వేతనాలు పెంపుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటిస్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి దఫాలో ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు వైనాలా రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దుద్దిళ్ల శ్రీను బాబు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబును సన్మానించిన బార్ అసోసియేషన్

మంథని, మే 2: మంథని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును గురువారం ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ ఆఫీసులో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన మంత్రి శ్రీధర్‌బాబు..

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన కాకతీయ ఉన్నత పాఠశాల విద్యార్థులను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలు అభినందించి సన్మానించారు.

కేసీఆర్ రోడ్ షోకు తరలిరావాలి

యైటింక్లయిన్‌కాలనీ, మే 2: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ శుక్రవారం గోదావరిఖని రానున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు మేడి సదానందం పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మందల కిషన్‌రెడ్డి, తాళ్ళ రాజయ్య, దాసరి బాల రాజు, గుడెల్లి రాంచందర్, పులి రాకేష్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను తరిమికొట్టాలి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 2: పదేళ్ల అధికారంలో ఉండి ప్రజలకు అన్యాయం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను తరిమికొడదామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం గోదావరిఖనిలోని 7, 6, 25 డివిజన్లలో కార్నర్ మీటింగ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలందరి కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్లను కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మే 2: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఎల్ఐసీ ఏజెంట్లను కోరారు. గురువారం గోదావరిఖనిలోని రామగుండం ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ నందిగాం శ్రీనివాస్ రావు, ఏబీఎం నాగేంద్ర కుమార్, శ్రీనివాస్ ఏఓ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆఫీసర్స్, ఏజెంట్లను కలిసి మే 13న జరగబోయే పెద్దపెల్లి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దివంగత నేత కాకా వెంకటస్వామి మనుమడు గడ్డం వంశీకృష్ణ చేయి గుర్తుపై ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సింగరేణిని, రైల్వే సంస్థని, ఎల్ఐసీ సంస్థని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల్లో ఐదు పథకాలు అమలులోకి వచ్చాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మరిన్ని పతకాలతో పాటు ఈ ప్రాంత అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు,

ఆరు గ్యారంటీలపై సందేహం వద్దు

ఎలిగేడు, మే 2 : ఆరు గ్యారంటీలపై సందేహించకుండా కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్ రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంక టేశ్వర్‌రావు, గోదల శ్రీనివాస్‌రెడ్డి, తాటిపల్లి రమేష్‌బాబు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, బూర్ల వెంకటసత్యం, అమ్ముల రమేష్, పెద్దపల్లి దేవారాజు, పొట్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా కేసుల్లో నిందితులకు పోలీస్ కస్టడీ




నిందితులను కస్టడీకి తీసుకుంటున్న సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్‌క్రైం, మే2: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇంటి స్థలాన్ని కాజేసేందుకు యత్నించిన, విక్రయదారులను బెదిరింపులకు గురిచేసి డబ్బు దోపిడీకి పాల్పడిన కేసులో నలుగురు, నకిలీ పత్రాలతో ఇంటిని కూల్చిన కేసులో ఐదుగురు మొత్తం 9 మంది నిందితులను గురువారం కస్టడీకి తీసుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ బ్యాంకు కాలనీకి చెందిన దొమ్మటి యుగందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 18వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవితో పాటు ఆమె భర్త కృష్ణ గౌడ్, కొత్త జైపాల్‌రెడ్డి, మున్సిపల్ ఆర్‌ఐ జంకే శ్రీకాంత్, మున్సిపల్ బిల్ కలెక్టర్ కొత్తపల్లి రాజుతో సహా మొత్తం 12 మందిపై కొత్తపల్లి పోలీసుఠాణాలో కేసు నమోదు కాగా, అందులో నలుగురు నిందితులు మొహమ్మద్ ఫిరోజ్‌ఖాన్, కాంపెల్లి రామాంజనేయులు, జంకే శ్రీకాంత్, కొత్తపల్లి రాజులను ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన మరింత కీలక సమాచారం సేకరించేందుకు జైలులో ఉన్న నలుగురు నిందితులని కోర్టు అనుమతి ద్వారా గురువారం ఉదయం 10:30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీకి తీసుకున్న నలుగురు నిందితులను విచారించటంతో పాటు వారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నామని సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు.

● బుల్డోజర్ గ్యాంగ్ అరెస్టు కేసులో కరీంనగర్ జైలులో ఉన్న నిందితులు బారాజు రత్నాకర్‌రెడ్డి, చందా శంకర్‌రావు, బకిట్ సాయి, పిట్టల మధు, షాహిద్‌ఖాన్‌లను కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారించేందుకు అనుమతి కోరుతూ కోర్టు ద్వారా గురువారం ఉదయం 10:30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీకి తీసుకున్న ఐదుగురు నిందితులను విచారించటంతో పాటు వారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నామని సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు.

ఊటూర్ సింగిల్‌విండో అధ్యక్ష, కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

మానకొండూర్, మే 2 : మండలంలోని ఊటూర్ సహకార సంఘం అధ్యక్షులు ముద్దసాని ప్రదీప్‌రెడ్డి కార్యదర్శి మిట్టపల్లి రవీందర్‌లకు గురువారం జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత నెల 16న సహకార సంఘంలో జరిగిన విచారణ నివేదికను విచారణ అధికారి రాజు డిసీవోకు అందజేశారు. దీంతో సహకార సంఘంలో కార్యదర్శి రవీందర్ తీసుకున్న వ్యక్తిగత రుణం రూ. 3.53లక్షలు, సంఘంలో రూ. 24లక్షల ఓవర్‌డ్యూ బినామీలకు అప్పుగా ఇచ్చారని అధ్యక్ష కార్యదర్శులు ఆ రుణాన్ని వసూలు చేయాలని జారీ చేసిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. పదిరోజుల్లోగా ఎంసీ సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన నోటీస్‌లో పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● రూ. 67,700, 8 తులాల వెండి స్వాధీనం



దొంగలను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

జగిత్యాల టౌన్, మే 2 :తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను గురువారం జగిత్యాల పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద రూ. రూ. 67,700 వేల నగదు, 8 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘచందర్ విలేకరుల సమావేశం నిర్వహించి ఇద్దరు దొంగలను అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట చెందిన విబూది శేఖర్ గత ఐదు సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఆలయాలతో పాటు ఇళ్లలో దొంగతనాలు చేసి జల్సాలకు అలవాటు పడ్డాడు. 10 దొంగతనాల కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో శేఖర్‌కు బుగ్గారం మండలం బీర్‌సాని గ్రామానికి చెందిన గుమ్మాల వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం జిల్లా కేంద్రంలో ఏడు ఇళ్లలో చొరబడి రూ.1.11 లక్షల నగదు, 8తులాల వెండిని నగలను దోచుకున్నారు.

పోలీసులు గురువారం కరీంనగర్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా పట్టుబడ్డారు. విచారణలో దొంగలుగా గుర్తించి వారి వద్ద రూ. 67,700 వేల నగదు, 8 తులాల వెండి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మధ రావు, నరేష్ తదితరులు ఉన్నారు.

కోటి 51 లక్షలకు పైగా నగదు జప్తు

● కోటి 48 లక్షలకు పైగా విడుదల ● పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీలలో ఇప్పటివరకు కోటి 51లక్షల 38వేల 82 రూపాయలను జప్తు చేసి, సరైన ఆధారాలు పరిశీలించి గ్రీవెన్స్ కమిటీ కోటి 48 లక్షల 58 వేల 702 రూపాయలను విడుదల చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 6లక్షల 81 వేల 830 రూపాయలు, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 17 లక్షల 5 వేల 500, చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 8 లక్షల 59 వేల 200 రూపాయలు, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 49 లక్షల 41 వేల 922, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 15లక్షల 76 వేల 330 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ పూర్తిస్థాయిలో నగదును విడుదల చేసిందన్నారు. రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 22 లక్షల 90 వేల 90 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి 20 లక్షల 61 వేల 710 రూపాయలను, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 30 లక్షల 83 వేల 210 రూపాయలు నగదు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి 30లక్షల 32 వేల 210 రూపాయలను విడుదల చేశామన్నారు. సరైన ఆధారాలు సమర్పించని కారణంగా 2లక్షల 79వేల 380 రూపాయలు విడుదల చేయలేదన్నారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీలలో జప్తుచేసిన సొమ్ము, ఆభరణాలపై ప్రతిరోజు కలెక్టరేట్‌లోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో గ్రీవెన్స్ కమిటీ ప్రతిరోజు సమావేశం నిర్వహించి, ఆధారాలను పరిశీలించి జప్తు చేసిన నగదు, ఆభరణాలను విడుదల చేస్తుందని, తనిఖీల సమయంలో నగదు, ఆభరణాలు జప్తునకు గురైతే ఆందోళన చెందకుండా వాటికి సంబంధించిన ఆధా రాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీకి సమర్పిస్తే వెంటనే విడుదల చేస్తుందని ప్రకటనలో తెలిపారు.

కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న వ్యక్తి రిమాండ్

మెట్‌పల్లి, మే, 2 : కోర్టు కేసుకు కొన్ని రోజుల నుంచి హాజరు కాకుండా తిరుగుతున్న బోందు గణేష్‌సింగ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన బోందు గణేష్‌సింగ్‌పై కేసు నమోదు కావడంతో కోర్టులో హాజరు కావాల్సి ఉంది. కానీ కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న గణేష్‌పై నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ ఉంది. దీంతో అయనను పట్టుకుని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

● లోక్‌సభ ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని మెట్‌పల్లి సీఐ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి అధారాలు లేకుండా దిచక్ర వాహనంపై రూ. 1,70వేల నగదును తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. పట్టుకున్న వ్యక్తి నుంచి నగదును స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ. 50వేలకు మించి ఉంటే వాటికి సంబంధించిన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

తానా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్



సుభాష్‌నగర్, మే 2: తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రంలోని వాసుదేవ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లాల్లో తానా శాఖల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రామానుజమ్మకు కాంస్యం

సిరిసిల్ల టౌన్, మే 2: జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పరుగు పందెంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన టమటం రామానుజమ్మ కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామానుజమ్మను మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ఏప్రిల్ 26 నుంచి 28 వరకు ముంబాయి విద్యావిహార్ (ఈస్ట్)లోని సోమయ్య అథ్లెటిక్స్ ట్రాక్‌పై 43వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ - 2024 పోటీలు నిర్వహించారు. పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి రామానుజమ్మ హాజరయ్యారు. మహిళల 70ప్లస్ విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో రామానుజమ్మ మూడో స్థానంలో నిలిచింది. ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ నాగూర్, ప్రధాన కార్యదర్శి వికాస్‌చౌవన్ కాంస్య పతకంతో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు.



కాంస్య పతకంతో రామానుజమ్మ

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

గణేశ్‌నగర్, మే 2: విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ప్రతి డివిజన్, సబ్ డివిజన్‌లో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ భద్రత ప్రాముఖ్యతను వివరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేయాలని అన్నారు. మే1 నుంచి 7వరకు వారం రోజులు విద్యుత్ భద్రత సమావేశాలు నిర్వహించి అందరికీ కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. రైతులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం, వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినప్పుడు కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వలన విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయ పంపుసెట్లను స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమన్నారు. గృహాలలో అతుకులు లేని సర్వీసు వైరును మాత్రమే ఉపయోగించాలని ఎస్‌ఈ సూచించారు. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వాడరాదన్నారు. కొన్ని చోట్ల జంతువుల నుంచి పంట రక్షణ కొరకు విద్యుత్ ఫెన్సింగ్ వేస్తున్నారని ఇది చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలకు ఫిర్యాదులు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబరు 18004250028కు లేదా 1912కు ఫోన్ ద్వారా తెలపాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్, విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, రాజేశం ,లావణ్య, ఆ.చంద్రయ్య, హబీబా, సురేష్ కుమార్, శ్రీహరి, మునీందర్, చంద్రశేఖర్, పండరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఈ గంగాధర్

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మే 2: పట్టణంలోని ఆదర్శనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన కస్తూరి పద్మ కుమారుడు క్రాంతికుమార్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. పద్మ తన కోడలితో నివాసం ఉంటోంది. బుధవారం పద్మ తన కోడలుతో మెట్‌పల్లి పట్టణంలో బంధువుల ఇంటికి ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటి తాళం పగుల గొట్టి ఉండటంతో గమనించిన కాలనీవాసులు విషయాన్ని పద్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పద్మ ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉండి బీరువా తెరిచి ఉండడంతో స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ కిరణ్ కుమార్ విచారణ చేపట్టారు. బీరువాలో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలతో పాటు ఇంటి ఆవరణలో ఉన్న ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేసి విచారణ చేపట్టారు.

పొలాల్లో అగ్ని ప్రమాదం.. విద్యుత్ పరికరాలు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 2: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం ప్రాంతంలో గురువారం వ్యవసాయ పొలాల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలోని రైతులకు చెందిన సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను కోసి గడ్డిని పొలాల్లో ఉంచారు. ఒక్కసారిగా పొలాల్లో మంటలు వ్యాపించాయి. రైతులు దేవయ్య, నాగరాజు, అంజయ్యలతో పాటు మరో సుమారు పది మంది రైతులకు చెందిన సాగునీటి పైపులు, విద్యుత్ స్టార్టర్లు, కరెంటు తీగలు కాలిపోయాయి. చుట్టుపక్క రైతులు చేరుకొని సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. వరి పంటను కోసి గడ్డికి నిప్పుపెట్టడం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని భావిస్తున్నారు. తమను ఆదుకోవాలని భారత రైతులు కోరారు.

● కోనరావుపేట:మండలంలోని ధర్మారంలో ప్రమాదవశాత్తు వరి కొయ్యలకు నిప్పు అంటుకొని పలువురు రైతులకు చెందిన కరెంటు మోటర్లు, స్టార్టర్లు, కరెంటు వైర్లు దగ్ధమయ్యాయి. సుమారు 20 మంది రైతులకు చెందిన పరికరాలు దగ్ధం కావడంతో రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.


పొలాల్లో చెలరేగుతున్న మంటలు

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

కొడిమ్యాల, మే 2: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో జనవరి 31న రాత్రి రొండ్ల ప్రమీల ఇంటిలో దొంగతనం చేసిన కేసులో నిందితుడైన వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన పాశం పవన్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు గురువారం ఉదయం మండలంలోని జేఎన్‌టీయూ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా అనుమానించి వారిని పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా నిందితుడు వివరాలను వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. నిందితున్ని కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు. మిగతా నిందితులను పట్టుకుంటామన్నారు.

పనికి తగ్గ వేతనం అందడం లేదని ఉపాధి కూలీల ఆగ్రహం

చందుర్తి, మే 2: పనికి తగ్గ వేతనం రావడం లేదని ఉపాధి హామీ కూలీలు గురువారం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చందుర్తి మండల కేంద్రం శివారులో అటవీ ప్రాంతంలోని చీకటిలోయ ప్రాంతంలో మార్చి నుంచి దాదాపు 300 మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో భాగంగా కందకాలు తీసే పనులు చేస్తున్నారు. తమకు పనికి తగ్గ వేతనం రాలేదని ఉపాధి హామీ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ మాట్లాడుతూ పనులు సక్రమంగా చేయడం లేదని పేర్కొనడంతో, కొంత మంది కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను పరిశీలించకుండానే, ఇష్టానుసారంగా హాజరు వేస్తున్నారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు మరొక టెక్నికల్ అసిస్టెంట్‌ను కేటాయించాలని ఏపీవోను కోరారు. ఏపీవో రాజయ్య మాట్లాడుతూ వేతనం తక్కువ రాకుండా, కొలతల ప్రకారం పేమెంట్ చేస్తామన్నారు.


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

వడదెబ్బతో హమాలీ మృతి


గజ్జెల సంజీవ్ (ఫైల్)

శంకరపట్నం, మే 2: శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన హమాలీ వడదెబ్బతో మృతి చెందాడు. హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, వంగర గ్రామానికి చెందిన గజ్జెల సంజీవ్ (48) సుమారు 20సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం శంకరపట్నం మండలం లింగాపూర్ తన అత్తగారి ఊరులో హమాలీ పనిచేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. రెండ్రోజుల క్రితం వాంతులు, విరోచనాలు కావడంతో హుజూరాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి ఇంటికి వెళ్లాడు. 1న రాత్రి ఊపిరి ఆడకపోవడంతో కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

రాజ్యాంగంపై కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు

సిరిసిల్ల టౌన్, మే 2: బీజేపీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు మారుస్తుందని కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అనేక సార్లు హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, బీఆర్‌ఎస్ పార్టీలను భూస్థాపితం చేయడం మాదిగల లక్ష్యం అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ కేటాయించలేదని ఆరోపించారు. రిజర్వేషన్లను మొదటి నుంచి బండి సంజయ్ బలపరుస్తూ వస్తున్నాడని అన్నారు. పది సంవత్సరాలు పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ వర్గీకరణపై ఒక్క చర్యలు తీసుకోలేదని వర్గీకరణ కోసం పోరాడిన బిడ్డల్ని కేసీఆర్ జైలులో పెట్టించాడని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్గీకరణపై అంకితభావంతో ఉన్నాడని అన్నారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి జాతి మొత్తం అండగా ఉంటుందని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించిన కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ మే 4న ఛలో హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, కో కన్వీనర్ పసుల బేష్, జిల్లా, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

కొండగట్టులో ముడుపుల ఆదాయం రూ.1.53లక్షలు

మల్యాల, మే 2: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో గత నెలలో జరిగిన చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దీక్షాపరులు చెల్లించుకున్న ముడుపులను గురువారం దేవస్థానం అధికారులు లెక్కింపు చేపట్టారు. కొబ్బరికాయలు, బియ్యం, డబ్బులను వేర్వేరు చేసి లెక్కింపు చేయగా రూ.1,53,461 నగదు సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ముడుపుల కొబ్బరికాయలు, బియ్యంను వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ లెక్కింపులో ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు సునీల్‌కుమార్, చంద్రశేఖర్‌లతో పాటు రాజేశ్వర్‌రావు, జెమిని శ్రీనివాస్, ఉమామహేశ్వర్, శ్రీలలిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 215మంది మహిళ సేవకులు, ట్రస్ట్ నిర్వహకులు విశ్వనాథుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ముడుపుల సొమ్ములను లెక్కిస్తున్న ఆలయ అధికారులు

కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం

గణేశ్‌నగర్,మే 2: రాంనగర్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో భాగంగా కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సుల శిక్షణ ప్రారంభం అవుతున్నాయని ఆసక్తి గల యువతీ యువకులు రాంనగర్‌లో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నైపుణ్య శిక్షణకు అర్హులు ఏడవ తరగతి ఆ పైబడిన తరగతి పాసైన, ఫెయిల్ అయిన 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు, పురుషులు, స్త్రీలు కూడా అర్హులు అని తెలియజేశారు. ఈ శిక్షణ మూడు నెలలు ఉంటుందని తెలిపారు. కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. కోర్సు ఫీజు వివరాలు కంప్యూటర్ (ఎమ్మెస్ ఆఫీస్, డిటిపి) రూ. 1,000, బ్యూటీషియన్ రూ. 1500, అని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి తెలియజేశారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. మంగళవారం ఇరువై మంది రైతులు 324క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.5200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

భూ కబ్జాకు యత్నించిన వ్యక్తి అరెస్టు

చొప్పదండి, మే 2: తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ ఉపేంద్రాచారి కథనం మేరకు రుక్మాపూర్‌కు చెందిన 15ఏ సర్వే నెంబర్‌లో 35 గుంటల భూమిని రుక్మాపూర్‌కు చెందిన ముద్దసాని రంగయ్య, వంగ సురేష్, చొప్పదండికి చెందిన గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం ఇంద్రసేన రెడ్డిలు 2017లో కొనుగోలు చేశారు. ఈ భూమి తనదేనని ముద్దసాని రాజయ్య కోర్టులో కేసు వేయగా అనంతరం లోక్ అదాలత్‌లో నలుగురు రాజీ పడ్డారు. కాగా ఈ భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో గ్రామానికి చెందిన ముద్దసాని కొమురయ్య, లంక శేఖర్‌లు ముద్దసాని రాజయ్య వద్ద 2013లో రూ.34 లక్షలకు కొనుగోలు చేసినట్లు సాదా బైనామా కాగితాన్ని సృష్టించి భూమిని వివాదం చేశారు. నలుగురు పట్టాదారులను మోకాపై భయభ్రాంతులకు గురి చేశారని ముద్దసాని రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దసాని కొమురయ్య, లంక శేఖర్‌లపై చీటింగ్, ఫోర్జరీ ఫాల్సిఫికేషన్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ముద్దసాని కొమురయ్యను అరెస్టు చేసి రిమాండుకు పంపించగా, లంక శేఖర్ కరీంనగర్ రూరల్‌లో నమోదైన కేసుకు సంబంధించి జైలులో ఉన్నట్లుతెలిపారు.

అక్కాచెల్లెళ్లను అప్పగించిన పోలీసులు

మల్యాల, మే 2: అదృశ్యమైన అక్కాచెల్లెళ్లను పోలీసులు తండ్రికి అప్పగించారు. మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన అక్కాచెల్లెల్లు వైష్ణవి(17), ప్రసన్న(15)లు మంగళవారం రాత్రి మేడపైన పడుకోగా బాత్రూంకు అని కిందకు దిగి ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాక పోవడంతో తండ్రి బాబు పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ మేరకు బాలికల తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై అబ్దుల్ రహీం, పోలీసులు పలు చోట్ల గాలింపు చేపట్టారు. అయితే ఆధార్‌కార్డులు వెంట బెట్టుకొని బయలుదేరిన అక్కాచెల్లెల్లు ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్‌కు వెళ్లి అక్కడ నుంచి బుధవారం రాత్రి జగిత్యాల బస్టాండ్‌కు తిరిగివచ్చారు. వారిని గమనించిన కొందరు మల్యాల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై అబ్దుల్ రహీం, పోలీసులు అక్కడకు చేరుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారించి తండ్రికి అప్పగించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మల్యాల, మే 2: దిగువ కొండగట్టులో ద్విచక్ర వాహనం చోరీకి గురి అయింది. పంజాల మల్లేశంగౌడ్‌కు చెందిన ద్విచక్రవాహనంను బుధవారం రాత్రి ఇంటి ముందు పార్క్ చేసి పెట్టగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు జరుపుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న మాధవానందస్వామి


మాధవానంద స్వామికి పండ్లు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

వేములవాడ, మే 2: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని తొగుట పీఠాధిపతి మాధవానందస్వామి గురువారం దర్శించుకున్నారు. స్వామీజీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేక పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, స్థానాచార్యులు అప్పాల భీమా శంకర్, అర్చకులు స్వామీజీకి పండ్లు అందజేశారు. అనంతరం స్వామీజీ ఆశీర్వచనం గావించారు. ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు తిరుపతి రావు, ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, ఈవో సీసీ ఎడ్ల శివసాయి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం, మే 2 : కరీంనగర్ పట్టణంలో ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 16 మంది వ్యక్తులను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా జడ్జి ఇందులో నుంచి ఒక వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష మరొక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష, ఇంకొక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం రూ. 4,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మిగతా 13 మంది వ్యక్తులకు 18 వేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

రాజీ మార్గంలో 43 సంవత్సరాల ఆస్తి వివాదం పరిష్కారం

జగిత్యాల టౌన్, మే 2 :జగిత్యాల కోర్టులో 43 సంవత్సరాలుగా కొనసాగుతున్న వారసత్వ ఆస్తి వివాదం గురువారం రాజీమార్గం ద్వారా పరిష్కారం అయింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన రుద్రంగి నర్సయ్య, రుద్రంగి రాజన్న, విశ్వనాథం అనే ముగ్గురు సోదరుల మధ్య తన తండ్రి స్థిర, చర ఆస్తుల పంపిణీ విషయంలో వివాదం ఏర్పడింది. 1981లో ఈ వివాదం జగిత్యాల కోర్టు ఏర్పడగానే మొదలైంది. వీరికి జగిత్యాల బ్రాహ్మణవాడతో పాటు జగిత్యాల అర్బన్ మండలం మోతె, తిప్పన్నపేటలో స్థిర, చర ఆస్తులు ఉన్నాయి. కోర్టులో కేసు కొనసాగుతుండగానే రాజన్న, విశ్వనాథంలు అనారోగ్యంతో మృతి చెందారు. అయితే నర్సయ్య తన సోదరుల వారసులతో రాజీ కుదుర్చుకోగా న్యాయవాదులు మహేందర్, సుబ్రహ్మణ్యం, మురళీధర్ రావులు తమ వాదనలను సివిల్ జడ్జి ప్రసాద్ సమక్షంలో రాజీ కుదిర్చారు. దీంతో 43 సంవత్సరాలుగా వారసత్వ ఆస్తి వివాదం ముగిసింది.

జగిత్యాలలో రేషన్ బియ్యం పట్టివేత


ఆటోలో తరలిస్తున్న బియ్యం సంచులు

జగిత్యాల టౌన్, మే 2 : జగిత్యాల జిల్లా కేంద్రంలో రేషన్ బియ్యం అక్రమ దందా కొనసాగుతూనే ఉంది. జిల్లా కేంద్రంలోని బీట్ బజార్ ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని కొంతమంది ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా వాహనానికి పంక్చర్ అయ్యింది. దీంతో వారు అక్రమ రేషన్ బియ్యాన్ని ఒక ఆటో నుంచి మరో ఆటోలో తరలించే క్రమంలో స్థానికుల సమాచారంతో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు రెండు ఆటోలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, మే 2:సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో గురువారం నేరాల నియంత్రణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 100 డయల్ చేయాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కొప్పులను భారీ మెజార్టీతో గెలిపించాలి

పెద్దపల్లి రూరల్, మే 2 : పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య, సలేంద్ర రాములు, శ్రీనివాస్, దర్శపురి, సమ్మయ్య, కలవేన కుమార్, సతీష్, నరేష్, సదయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం

పెద్దపల్లి రూరల్, మే 2 : దేశ ప్రధాని మోదీతోనే అభివృద్ధి సాధ్యమని పెద్దపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని నిమ్మనపల్లిలో పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గోమాసే శ్రీనివాస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రమేష్, మండల ఓబీసీ మోర్చ పడాల శ్రీధర్, బీజేవైఎం మండల అధ్యక్షులు మామిడి ఉమేష్, లక్ష్మణ్, కుమార్, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలనీలో కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం

యైటింక్లయిన్‌కాలనీ, మే 2: కాలనీలోని 16, 18 డివిజన్లలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాయి. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీల్లో ఐదు అమలు జరుగుతున్నాయని, ఎన్నికల అనంతరం ఒక హామీ అమలుచేయనున్నట్టు నాయకులు తెలిపారు. ఈప్రచారంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, ఆకుల రాజిరెడ్డి, మార్క రాజు, చక్రపాణి, రాజేశం, రాకేష్, పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, మే 2: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా మండలంలోని మిర్జంపేటలోని ఉపాధిహామీ పనుల వద్ద ఆ పార్టీ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కూలీలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కామిడి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు మాదాసి సువర్ణచందు, గొల్లమల్ల కౌసల్యాశంకర్, మండల యూత్ అధ్యక్షుడు నూనేటి కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు శిలారపు మల్లన్న, జక్కే రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గొడుగు మల్లేష్ యాదవ్, నరెడ్ల సదానందం, వెన్నెల సదయ్య, సిరికొండ కొమురయ్య, గోపు సతీష్, ఉయ్యాల ఓదెలుగౌడ్, సిరికొండ సదానందం, పుల్లూరి కుమార్, మూల రాజు, మొగిలి తిరుపతి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో మోసం

ఓదెల, మే 2: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం కొలనూర్, ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలను, మత్స్య కార్మికులను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అందుబాటులో ఉండే వ్యక్తికి ఓట్లు వేసి ఆదరించాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్‌ల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గంట రాము లు, దాసరి ఉష, సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్, కనికిరెడ్డి సతీ ష్, మాజీ ఎంపీపీ రామస్వామి, చింతం మొగిలి, పోలోజు రమేష్, బోడకుంట సతీష్, తీర్థాల కుమార్, గుండేటి మధు, శ్యాం, మార్క రవి, కుమార్, మద్దెల శ్రీను, కర్రె మహేందర్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, మే 2: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్యాల, పందిల్ల, ఆరెపల్లి, గంగారం గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వద్ద కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటు వేయాలని కూలీలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు లంక సదయ్య, ఎంపీటీసీ రావి సదానందం, మాజీ సర్పంచ్‌లు అటికం శంకరయ్య, ఈద సత్యనారాయణరెడ్డి, మేడి అశోక్‌గౌడ్, బద్రి, వేమారెడ్డి, రాజు పాల్గొన్నారు.

గుడిమిట్టలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

సుల్తానాబాద్, మే 2: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గుడిమిట్టలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురువారం నాయకులు తిప్పారపు దయాకర్, కౌన్సిలర్ కూకట్ల గోపి, బాబురావు, గొట్టం మహేష్, తోట వెంకటేశ్, మల్లికార్జున్, శ్యామ్, పొసాని శ్రీనివాస్, కనవేని సతీష్, శ్రీనివాస్, సంజీవ్, కృష్ణంరాజు, రాకేష్ తదితరులు పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానికుడైన ఈశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మే 2: అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాల అధికారులతో రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ గురువారం బ్రీఫింగ్ సెషన్ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్), రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారులతో సీపీఎం శ్రీనివాస్ సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల్లో కేంద్ర బలగాలు రామగుండం కమిషనరేట్ పోలీసులతో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా బందోబస్తు నిర్వహించాలన్నారు. ఓటర్లకు భయాందోళనలకు అవకాశం లేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వేయడంలో భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, బందోబస్తు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత బందోబస్తు విధులు నిర్వర్తించాలని, ఎన్నికల రోజు ఎల్‌డబ్ల్యూఈ పోలింగ్ స్టేషన్లు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో స్టాటిక్ బందోబస్తు, మిగతా ఫోర్స్ రూట్ బందోబస్తు, అత్యవసర పరిస్థితి సమయంలో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్‌టీ టీమ్స్ డ్యూటీలు, ఎల్‌డబ్ల్యూఈ ఏరియాలో ఏరియా డామినేషన్, కార్డెన్ సెర్చ్ ఆపరేషన్స్, విధుల గురించి వారికి వివరించారు. కీలకమైన పాయింట్ల వద్ద సెంట్రల్‌ఫోర్స్ సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. కేంద్ర బలగాలు ఉండడానికి సరైన వసతి ఏర్పాట్లు చేయాలని, వారితో కలిసి పనిచేయాలని ఏసీపీలను ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల భద్రతలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు ఐదు కంపెనీలు రాగా రెండు సీఆర్‌పీఎఫ్, మూడు బీఎస్ఎఫ్ కంపెనీ బలగాలు ఉండగా, అందులో మొత్తం అధికారులు, సిబ్బంది 443 మంది ఉన్నారన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, సీఆర్‌పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ ఏకే పాండే, పరమానంద్‌యాదవ్, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు డేవిడ్ లాల్ తనసిమ్మ, భరత్ సింగ్, స్వరూప్ సమంత, డిప్యూటీ కమాండెంట్లు రతన్ లాల్, నరేష్ కేఆర్ షేరన్, ఏసీపీలు పెద్దపల్లి జి. కృష్ణ, గోదావరిఖని ఏసీపీ రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, మంచిర్యాల ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులు మద్దతు ఇవ్వాలి

- బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మే 2: సింగరేణి కార్మికులు తనకు మద్దతు ఇవ్వాలని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. గురువారం స్థానిక చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివేక్‌పై ఆయన మాట్లాడారు. వివేక్ రాజకీయ అనైతికతను చూసి ఆయన తండ్రి ఆత్మ ఘోషిస్తుందన్నారు. స్థానిక శాసనసభ్యుడు మక్కాన్ సింగ్ కూడా అబద్ధాలు మాట్లాడుతున్నాడని అన్నారు. ఇక్కడి ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు వివేక్‌వెంకటస్వామి ఎప్పుడైనా ఆదుకున్నాడా అని, ఎవరికైనా ఉపాధి కల్పించాడా అని ఈశ్వర్ అన్నారు. ప్రజలను కలువడానికి ఇష్టపడని వివేక్ నిత్యం ప్రజలమధ్య బతుకుతున్న తనను విమర్శించడం అర్థరహితమన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కార్మికవర్గానికి వివేక్, మక్కాన్‌సింగ్, కొప్పుల ఈశ్వర్ చరిత్ర తెలుసునన్నారు. తాను 26ఏళ్లపాటు సింగరేణి కార్మికునిగా ఓసీపీ మట్టికుప్పల్లో పని చేశానని, 5వ వేజ్‌బోర్డు కోసం ఆరు రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసిన చరిత్ర తనదన్నారు. 7ఎల్ఈపీ ఘటన సందర్భంలో కార్మికుల పక్షాన పోరాడినందుకు 15రోజులు జైలుకు వెళ్లానని, ఆమ్స్ యాక్ట్ కింద మూడున్నర నెలల జైలు జీవితం గడిపానని, 45రోజుల కార్మికుల సమ్మె సందర్భంగా నాసా చట్టం కింద జైల్లో ఉన్నానని, ఇది తన చరిత్ర అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత సింగరేణి కార్మికవర్గానికి 35రోజుల సకల జనుల సమ్మెకాలం నాటి వేతనం తిరిగి కార్మికులకు ఇప్పించామని, కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇచ్చిందని, కాంగ్రెస్ హయాంలో పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య నియామకాలుగా మార్చి పదేళ్లలో 19వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. లాభాలవాటా 18శాతం ఉంటే 32శాతానికి పెంచామని, ఇలాంటి చరిత్ర నాదని, దీనిపై గోదావరిఖని చౌరస్తాలో చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. సామాజిక న్యాయం అంటే ఒకే కుటుంబంలో మూడు పదవులు పొందడం కాదని, స్థానికంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎస్సీ నాయకుల అవకాశాల్ని ఒకే కుటుంబం లాక్కోవడం అంబేద్కర్ చెప్పిన సిద్ధంతామా అని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా వందల కంపెనీలు పెట్టి వ్యాపారం చేస్తున్న వివేక్ కుటుంబం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎందుకు కర్మాగారాలు పెట్టడం లేదని, ఇక్కడి యువతకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కేవలం అధికారం కోసం మాత్రమే పెద్దపల్లిని వివేక్ కుటుంబం వాడుకుందని ఆరోపించారు. కేసీఆర్‌కు తెలంగాణలో వస్తున్న ప్రజా ఆదరణను చూసి ఓర్వలేక కుట్రపూరితంగా బస్సు యాత్రను కాంగ్రెస్ ఆపిందని, కానీ కాంగ్రెస్‌పై తెలంగాణ ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకతను ఆపలేరన్నారు. 48గంటల విరామం తరువాత శుక్రవారం సాయంత్రం గోదావరిఖని చౌరస్తాలో కేసీఆర్ రోడ్‌షో ఉంటుందని, అందుకు ప్రజలు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు పీటీ స్వామి, పెంట రాజేష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

- ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, మే 2 : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, అందుకు ఉపాధికూలీలు సైతం తమవైపు నిలవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. జూలపల్లి మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్, తెలుకుంట, చీమలపేట్, నాగులపల్లి గ్రామాల్లో గురువారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఉపాధిహామీ కూలీలు పని చేస్తున్న పని ప్రదేశాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ఉపాధి కూలీలను కోరారు. కేంద్రంలో తమ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల బతుకులకు భరోసా లభిస్తుందన్నారు. ఉపాధి కూలీల పనిదినాలను వంద రోజుల నుంచి రెండు వందల రోజులకు పెంచుతామని, అలాగే కూలీ వేతనాలను పెంచుతామన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ పథకాల హామీలను వంద రోజుల్లో అమలు చేసిన ఘనత తమ కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు జడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య, విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్ రావు, విండో మాజీ చైర్మన్ గండు సంజీవ్, మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహ యాదవ్, బొజ్జ శ్రీనివాస్, లోక జలపతిరెడ్డి, మాను మండ్ల శ్రీనివాస్, కొమ్ము పోచయ్య, బండి స్వామి, పొట్యాల బీరయ్య, ముమ్మాడి రవి, పలువురు పాల్గొన్నారు.

అహంకారపూరితంగా మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్


తెలంగాణ సెంటర్‌లో మాట్లాడుతున్న గొమాసే శ్రీనివాస్

రామగిరి, మే 2: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మంత్రి శ్రీధర్‌బాబు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని సెంటినరీకాలనీలోని తెలంగాణ సెంటర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభనుద్దేశించి ఆయన మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో 35ఎంఎం మాత్రమే చూశారని, 70ఎంఎం సినిమా చూపిస్తానని మంత్రి అహంకార ధోరణితో మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 93శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఉన్న నియోజకవర్గంలో శ్రీధర్‌బాబు శాసిస్తున్నాడని ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలుచేస్తామని ప్రకటించిన శ్రీధర్‌బాబు ఏ ఒక్కదాన్ని అమలు చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తి అయి నాలుగు నెలలు గడిచినా పెన్షన్‌లు పెంచలేదని, విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని ఇప్పటికి దాని ఊసేలేదన్నారు. అహర్నిశలు దేశం కోసం పరితపించే మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని, తనను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ టౌన్ అధ్యక్షుడు తీగల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, చల్లా నారాయణరెడ్డి, దీరజ్, తొట్ల రాజు, బీఎంఎస్ నాయకుడు సత్తన్న, ఎంఆర్‌పీఎస్ నాయకుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి

ఎలిగేడు, మే 2 : బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డిలు అన్నారు. గురువారం సుల్తాన్‌పూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కూలీలను అభ్యర్థించారు. సమ్మయ్య, సుధాకర్‌రావు, కల్లెం లక్ష్మణ్, న్యాతరి పోచాలు, కుమార్, గోస్కి మల్లయ్య, గోస్కి తిరుపతి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సమావేశం

ఎలిగేడు, మే 2: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల సమన్వయ సమావేశం ఎంపీడీవో భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగింది. కాంప్లెక్స్ హెచ్ఎంలు, హెడ్‌మాస్టర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు పాల్గొన్నారు. డ్రింకింగ్ వాటర్, ఎలక్ట్రికల్, టాయిలెట్‌వర్క్స్, మైనర్ అండ్ మేజర్ వర్క్స్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఈపీఆర్ జగదీశ్వర్, కవిత, ఎంఈఓఏపీఎం సుధాకర్, సిసిలు జ్యోతి. మల్లేశం, ఆనంద్, రజితలు పాల్గొన్నారు.

రేపు ఎలిగేడు మండల సర్వసభ్య సమావేశం

ఎలిగేడు, మే 2: ఎలిగేడు మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. 17అంశాలపై సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమయపాలన పాటించని అధికారులపై చర్యకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

టెన్నికాయిట్ శిక్షణ

సుల్తానాబాద్, మే 2: మండలంలోని రేగడి మద్దికుంట గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం టెన్నికాయిట్ క్రీడా శిక్షణ ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు దాసరి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు ప్రారంభించిన ఈ వేసవి కాల క్రీడా శిక్షణ శిబిరంలో భాగంగా జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమూర్తి, హెచ్ఎం రాధాస్వామి, కొలనూరు పీఈటీ ప్రణయ్ తదితరులు టెన్నికాయిట్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కదంబాపూర్ గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు బలరామ్ చే టెన్నికాయిట్ క్రీడలో పలు నైపుణ్యతల గురించి పిల్లలకు వివరించారు. బలరాంకు మెడల్ ప్రధానం చేసి సత్కరించారు.

'వరిలో మేలైన వంగడం 12368'

ఎలిగేడు, మే 2: వరిలో మేలైన వంగడం 12368రకం మంచి దిగుబడిని ఇస్తుందని కూనారం వ్యవసాయ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ శేఖర్‌సిద్దికి అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో 1238రకం పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూనారం వరి వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి మొదటి ఏడాది చిరు సంచుల పరీక్ష పూర్తి చేసుకున్న కెఎస్ఆర్ 12368 స్వల్పకాలిక సన్నగింజ రకం చేనుమీద పడిపోకుండా కొత్తరకం మెడవిరుపు, అగ్గితెగులును తట్టుకుంటుందన్నారు. మర ఆడించినప్పుడు 100కిలోల వడ్లకు సుమారుగా 62నుంచి 63కిలోల మంచి నాణ్యమైన బియ్యాన్ని అందిస్తుందని, అన్నం రుచిగా నాణ్యతగా ఉంటుందని ఈరకం విత్తనాలను దిగుబడి చేసుకొని రైతులు మంచి ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు ఏవో ఉమాపతి, ఏఈవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి 6 వరకు రైల్వే గేటు మూసివేత

పెద్దపల్లి రూరల్, మే 2: పెద్దపల్లి నుంచి గౌరెడ్డిపేట గ్రామానికి వెళ్లే దారిలోని రైల్వే గేట్‌ను శుక్రవారం నుండి 6వ తేదీ వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల దృష్ట్యా గౌరెడ్డిపేట రైల్వేగేట్‌ను మూసివేస్తున్నట్లు వాహనదారులు సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

న్యాయవాదులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి


న్యాయమూర్తి గణేష్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కోల్‌సిటీ, మే 2: న్యాయ వాదులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకొని పేదలకు న్యాయాన్ని అందించాలని బదిలీ అయిన గోదావరిఖని 1అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ దుర్గం గణేష్ అన్నారు. బుధవారం రాత్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మేజిస్ట్రేట్‌గా బదిలీ అయిన దుర్గం గణేష్‌కు మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలకు, బడుగు బలహీన వర్గాలకు సత్వర ఉచిత న్యాయాన్ని అందించేందుకు ప్రతి న్యాయవాది పాటుపడాలన్నారు. అనంతరం న్యాయమూర్తి దుర్గం గణేష్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, ఏజీపీ మేడ చక్రపాణి, ఏపీపీ నహీదా ఫర్హీన్, కమిటీ సభ్యులు రామటెంకి శ్రీనివాస్, పులిపాక ప్రవీణ్ కుమార్, చెలికల పద్మజ, బాస అనూరాధ, గుజ్జేటి సత్యనారాయణ, గోషిక ప్రకాష్, ఇరుగురాల మహేందర్, సంతోష్, దామసంతోష్, భానుకృష్ణ, వరలక్ష్మితో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ కుట్ర

-మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

మంథని, మే 2: రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు ఎత్తివేసే ఆలోచన బీజేపీ చేస్తుందని దీనిపై మాట్లాడినందుకు సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ కేసు పెట్టిందని, కాంగ్రెస్ పార్టీ పక్షాన దీన్ని ఖండిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. మంథనిలో బుధవారం రాత్రి జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేవున్ని ఉపయోగించుకుని ఓట్లడిగే ప్రయత్నం చేస్తున్నారని దేవుడు ఒకరు సొత్తు కాదని అందరివాడంటూ పరోక్షంగా బీజేపీపై రాజకీయ విమర్శలు గుప్పించారు. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా ఇష్టారాజ్యంగా అడ్డగోలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. పాంచ్ న్యాయ్, పచీస్ గ్యారెంటీ అనే కాంగ్రెస్ పార్టీ జాతీయ మేనిఫెస్టోను ఇంటింటికి ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈనెల 13న ప్రతి ఒక్కరూ చేయి గుర్తుకు ఓటు వేసి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సినీ నిర్మాత బండ్ల గణేష్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలు మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో పెద్దపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణకు సీపీఎం నేతల మద్దతు

మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలను సీపీఎం నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల పొత్తులో భాగంగా సీపీఎం నేతలు గడ్డం వంశీకృష్ణకు తమ మద్దతు తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఆయన గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎరవెల్లి ముత్యంరావు, ఏ. మహేశ్వరీ, వేల్పుల కుమారస్వామి, బూడిద గణేష్, ఆర్ల సందీప్, వేల్పుల సురేష్, గొర్రెంకల సురేష్, విరుగురాల ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


దేవునిపల్లిలో విరిగి ఉన్న విద్యుత్ స్తంభం

పెద్దపల్లి రూరల్, మే 2: మండలంలోని దేవునిపల్లిలో ఓ ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. నాలుగు నెలల క్రితం విద్యుత్ స్తంభం విరిగింది. అది ఎప్పుడో కిందపడుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

కోల్‌సిటీటౌన్, మే 2: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. సింగరేణి ఆర్‌జీ-1 వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్, గేమ్స్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి వేల రూపాయాలు వెచ్చించి క్రీడల్లో శిక్షణ తీసుకుంటారని, అలాంటిది సింగరేణి పరిసర ప్రాంత ప్రజలకు స్థానికంగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, ఈ శిబిరాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈమధ్య కాలంలో శారీరక క్రీడలకంటే సెల్‌ఫోన్ గేమ్స్‌కు ఆసక్తి కనపరుస్తూ ఎన్నో అనర్థాలకు గురవుతున్నారని, శిబిరంలోని ఆటలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయన్నారు. క్రీడలతోపాటు చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మనోహర్‌రావు, లక్ష్మీనారాయణ, సారంగపాణి, ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం, ఆఫీసర్స్ అసోసియేషన్ బాధ్యులు పి.శ్రీనివాస్, కోచ్, క్రీడాకారులు సామల సత్యనారాయణ, కెనడీ, సంపత్, జీ.రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తాం

- మంత్రి శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రామగిరి, మే 2: కార్మికుల సొంతంటి కలను సాకారం చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయనకు మద్దతుగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. సింగరేణి ప్రాంతంలో అనుబంధ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో పెద్దఎత్తున ఉపాధి కార్యక్రమాలను చేపడుతామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే కాకుండ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటి హామీలను నేరవేరుస్తామని పేర్కోన్నారు. అనంతరం మండలంలోని రత్నాపూర్ రామగిరి ఖిల్లా ప్రాంతంలో పనిచేసే ఉపాధిహామీ కూలీలను స్వయంగా కలిసి వంశీకృష్ణను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గోన్నారు.

బొగ్గు బాయిలపై మక్కాన్‌సింగ్ ప్రచారం...

గోదావరిఖని, మే 2: కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలంటూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గురువారం బొగ్గు బావులపై ప్రచారం నిర్వహించారు. బాయి బాట కార్యక్రమంలో భాగంగా జీడీకే1ఇంక్లైన్, ఏరియా వర్క్‌షాప్‌లలో ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు కే సదానందం అధ్యక్షతన కార్మికులతో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల నెరవేరుస్తామని, పెర్క్స్ విధించే ఇన్‌కంటాక్స్ రద్దు చేయిస్తామన్నారు. సింగరేణికి ఈ ఆర్థిక సంవత్సర వచ్చిన లాభాలలో వాటాను కార్మికులకు త్వరలో అందిస్తామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం, కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం పెద్దపెల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, మహంకాళి స్వామి, కాల్వ లింగస్వామి, ఐఎన్‌టీయూసీ నాయకులు గడ్డం కృష్ణ, ఎట్టం కృష్ణ, దేవులపల్లి రాజేందర్, మల్లికార్జున్, జనగామ స్వప్న, బాలయ్య, రాజేశం, జనగామ శ్రీనివాస్‌గౌడ్, నీరటి సాగర్, బూర జగన్, గుండేటి శ్రీనివాస్, ఎల్ ఆంజనేయులు, తాటికొండ అంజయ్య, సాయి కృష్ణ, కత్రోజు మోహన్, మంద రమేష్, పుట్ట రమేష్, ఫిరోజ్, పి అశోక్ కుమార్, ఏ కృష్ణ పాల్గొన్నారు.

ఏప్రిల్ నెల ఆర్జీ-2 ఉత్పత్తి 127 శాతం

యైటింక్లయిన్‌కాలనీ, మే 2: ఆర్జీ-2 ఏరియా గడిచిన ఏప్రిల్ నెలలో 127 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఈమేరకు ఆర్జీ-2 యాజమాన్యం ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ ప్రకటన వెలువరించింది. ఏప్రిల్ నెల ఉత్పత్తి లక్ష్యం 6,38,400 టన్నులకు 8,10,702 టన్నులు (127%) సాధించింది. ఓబీ వెలికితీత లక్ష్యం 49,34,000 క్యూబిక్ మీటర్లు కాగా 32,62,250 క్యూబిక్ మీటర్లు వెలికితీసినట్టు యాజమాన్యం ప్రకటనలో తెలిపింది. వకీల్‌పల్లె గని టార్గెట్ 28,400 టన్నులకు 72,204 టన్నులు (254%) బొగ్గు ఉత్పత్తి సాధించింది. రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి సాధించిన వకీల్‌పల్లె ఉద్యోగులకు జీఎం సూర్యనారాయణ అభినందనలు తెలియజేశారు. ఆర్జీ-2 ఏరియా నుండి రైలు, రోడ్డు మార్గాల ద్వారా గడిచిన నెలలో 9,62,438 టన్నుల బొగ్గు రవాణా జరిగినట్టు యాజమాన్యం ప్రకటనలో పేర్కొన్నది.